సాక్షి
కాకినాడ

గురువారం । 11 । మే । 2023



ఉష్ణోగ్రత

నగరం	గరిష్ట	కనిష్ట:
రాజమహేంద్రవరం	41.5	28.0
కాకినాడ	36.8	27.4
అమలాపురం	39.7	26.0



సప్లిమెంటరీ కసరత్తులు

పదో తరగతి, ఇంటర్మీడియెట్ ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించలేని విద్యార్థులపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది.

8లో

'నన్నయ' వీసీగా ఆచార్య పద్మరాజు



రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఉపకులపతిగా కాకినాడ జేఎన్‌టీయూ ఈసీఈ విభాగంలో అధ్యాపకునిగా, అడ్మిషన్స్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆచార్య కె.పద్మరాజును నియమించారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్ తెలిపారు. మూడేళ్ల పాటు ఆయన వీసీగా బాధ్యతలు నిర్వహించనున్నారు. కాగా 'నన్నయ' వర్సిటీకి ఆచార్య పద్మరాజు 5వ ఉపకులపతిగా బాధ్యతలు చేపట్టనున్నారు.

న్యూస్‌రీల్

పాలిసెట్‌కు 93.34 శాతం మంది హాజరు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన ఏపీ పాలిసెట్–23 పరీక్ష బుధవారం జిల్లాలో ప్రశాంతంగా జరిగింది. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ నిర్వహించిన పరీక్షకు ఆరగంట ముందుగానే విద్యార్థులను అనుమతించారు. పరీక్షకు 9519 మంది దరఖాస్తు చేసుకోగా 8,885 మంది హాజరయ్యారు. వీరిలో బాలురు 5,423 మంది బాలికలు 3,462 మంది ఉన్నారు. 93.34 శాతం హాజరు నమోదైనట్లు అధికారులు తెలిపారు. పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు పరీక్షల జిల్లా కో–ఆర్డినేటర్ జనార్దనరావు తెలిపారు.

12న జాబ్‌మేళా

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): జిల్లా ఉపాధి కార్యాలయంలో ఈ నెల 12న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి కుసుమ శాంతి బుధవారం తెలిపారు. ఎస్‌బీ మోటార్,అపోలో ఫార్మసీ సంస్థలు వివిధ క్యాడర్‌లలో 74 ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తాయన్నారు. పదో తరగతి నుంచి ఫార్మసీ వరకూ ఉత్తీర్ణులైన అభ్యర్థులు అర్హులన్నారు. అసక్తి గలవారు ఉదయం 8 గంటలకు హాజరుకావాలని సూచించారు.

అడవి జంతువుల కోసం విరివిగా గాలింపు



సుబ్బయమ్మపేటలో రైతుకు అడవి జంతువుల కోసం వివరిస్తున్న అటవిశాఖ అధికారులు

గండేపల్లి: పశువులపై దాడి చేస్తున్న అడవి జంతువుల కోసం అధికారులు గాలిస్తున్నారు. మండలంలోని మల్లేపల్లి, ఉప్పలపాడు శివారు పామాయిల్ తోటలో పశువులపై అడవి జంతువులు దాడి చేసిన సంగతి పాఠకులకు విదితమే. కాగా ఈ జంతువులు డొంకలు, తుప్ప లు, దట్టమైన పొదల్లో స్థావరం ఉంటున్నాయనే అనుమానంతో అటవీశాఖ అధికారులు గాలింపు చర్యలు చేపట్టారు. గూబురుగా ఉండే ఆయిల్ పామ్ తోటల్లోనే ఈ జంతువులు నివాసం ఉంటున్నాయని రైతులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. గత ఆరు రోజులుగా అడవి జంతువుల పాదముద్రలు కనిపిస్తున్నాయి గాని జంతువుల జాడ మాత్రం కానరావడం లేదు. పశువులపై దాడి జరిగిన సమీప గ్రామాలైన కె.గోపాలపురం, సుబ్బయమ్మపేట, ఎన్టీ రాజాపురం, జగ్గంపేట మండలం సీతారాంపురం, రాజుపూడి తదితర గ్రామాల్లో ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. అడవి జంతువుల సంచారం ఉన్నందున పశువులను జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు. అటవీ సెక్షన్ ఆఫీసర్ సిద్దార్థ్, బీట్ ఆఫీసర్ నూకాసాహెబ్, వీఎస్ఎస్ నారాయణ, ఉపేంద్రరెడ్డి, రాధాకృష్ణ తదితర సిబ్బంది బుధవారం సుబ్బయమ్మపేటలో పామాయిల్ తోట, కె. గోపాలపురంలో జీడి మామిడి తోటల్లో అడవి జంతువుల కోసం గాలించారు. పొలాలకు వెళ్లే రైతులు, కూలీలకు పలు సూచనలు చేశారు.

లెక్క తేలుస్తున్నారు

- పంట నష్టం అంచనాకు ప్రత్యేక బృందాలు
- ప్రాథమిక నివేదికపై ప్రారంభమైన కసరత్తు
- ఈ నెల 15 వరకు క్షేత్ర స్థాయిలో అంచనాలు
- 16 నుంచి ఆర్బీకేల్లో జాబితాల ప్రదర్శన
- త్వరగా పరిహారం చెల్లింపునకు సన్నాహాలు



రామచంద్రపురం మండలం నెలపర్తిపాడులో తడిసిన పంట నష్టం అంచనాల తయారీలో అధికారులు

సాక్షి ప్రతినిధి,కాకినాడ: ఏ సీజన్‌లో నష్టానికి ఆ సీజన్‌లో రైతులకు పరిహారం అందిస్తోన్న ప్రభుత్వం ఈ సారి కూడా అదే ఒరవడిని కొనసాగిస్తోంది. నష్టపోయిన ప్రతి రైతుకూ పరిహారం అందించాలనే చిత్తశుద్ధితో ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన కసరత్తు చేస్తోంది. రబీలో ఇటీవల చేతికొచ్చిన కొంత పంట అకాల వర్షాలకు తడిసిన సంగతి తెలిసిందే. ప్రభుత్వం వెంటనే స్పందించి తడిసిన ధాన్యం వల్ల రైతులు నష్టపోకుండా నిబంధనలు సడలించింది. రైతు భరోసా కేంద్రాల ద్వారా ఈసరికే పెద్ద ఎత్తున కొనుగోలు చేస్తోంది. జిల్లావ్యాప్తంగా సేకరణ ప్రక్రియను అధికారులు దగ్గరుండి మరీ పర్యవేక్షిస్తున్నారు.

ప్రాథమిక అంచనా

మరోవైపు వర్షాలతో జరిగిన పంట నష్టాల లెక్కలు తేల్చేందుకు అధికార యంత్రాంగం రంగంలోకి దిగింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో వరి ఇతర పంటలకు జరిగిన నష్టాన్ని గుర్తించే ప్రక్రియకు బుధవారం శ్రీకారం చుట్టారు. పంట నష్టంపై ఇప్పటికే మండల స్థాయిలో రెవెన్యూ యంత్రాంగం ప్రాథమిక నివేదికను రూపొందించింది. గ్రామాలలో తడిసిన పంటల వివరాలను ఇందులో పొందుపరిచారు. వీటిని సాంకేతికంగా నిర్ధారించేందుకు జిల్లా కలెక్టర్ల పర్యవేక్షణలో మండల, గ్రామ స్థాయిలో బృందాలు ఏర్పాటయ్యాయి. ఇప్పుడు క్షేత్ర స్థాయికి వెళుతోన్న ఈ బృందాలు ఆ నివేదికలను దగ్గర పెట్టుకుని పంటల వారీగా లోతుగా అంచనా తయారు చేస్తున్నారు. గత ఏప్రిల్ చివరి వారం, మే మొదటి వారంలో అకాల వర్షాలకు ఏమేరకు వాస్తవంగా నష్టం జరిగిందో బృందాలు లెక్కలేస్తున్నాయి. పంట నష్టం జరిగి ఉంటే సంబంధిత రైతు పేరు, అడంగల్ వంటివి నమోదు చేయాలని ప్రభుత్వం సూచించింది. 33 శాతానికి మించి నష్టం జరిగిన పంటలనే నష్టపరిహారానికి ప్రామాణికంగా తీసుకోనున్నారు.

16 నుంచి జాబితాల ప్రదర్శన

గ్రామ, మండల, డివిజన్ స్థాయిలలో మూడేసి బృందాలు సంయుక్తంగా నష్టం అంచనాలు రూపొందించనున్నాయి. గ్రామ స్థాయిలో సర్పంచ్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, గ్రామ వ్యవసాయ అసిస్టెంట్, వీఆర్ఓ, పంచాయతీ కార్యదర్శులు ఒక బృందంగా ఏర్పడ్డారు. మండల స్థాయిలో మండల పరిషత్ అధ్యక్షులు, తహసిల్దార్, మండల వ్యవసాయాధికారి, మండల అభివృద్ధి అధికారి, డివిజన్ స్థాయిలో ఆర్డీఓ, వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌తో బృందాలు ఏర్పడ్డాయి. బృందాలు తమకు అందిన ప్రాథమిక నష్టం నివేదికలతో ఈ నెల 15వ వరకు క్షేత్ర స్థాయిలో నష్టం అంచనాలను సరిచూస్తాయి. సరిచూశాక రైతుల వారీగా జరిగిన నష్టాన్ని లెక్కలేసి జాబితాలు రూపొందిస్తారు. పంట నష్టపోయినా జాబితాలో నమోదు కాలేదని రైతుల నుంచి వచ్చే అభ్యంతరాలు తెలుసుకుని పారదర్శకంగా ఉండేందుకు ఈ నెల 16 నుంచి 20 వరకు రైతు భరోసా కేంద్రాల్లో జాబితాలు ప్రదర్శిస్తారు. తుది జాబితాను ఆయా జిల్లాల కలెక్టర్లు ఈ నెల 21న ప్రభుత్వానికి నివేదించనున్నారు.



పిఠాపురం మండలంలో పంట నష్టాన్ని అంచనా వేస్తోన్న వ్యవసాయాధికారులు

ఇవెక్కడి విమర్శలు

వాస్తవం తెలుసుకోకుండా.. నష్టం అంచనాలు రూపొందించకుండా రైతులకు పరిహారం వెంటనే ఇవ్వాలని ప్రతిపక్ష నేత చంద్రబాబు రాజకీయం చేయడంపై విజ్ఞులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. పంటకు నష్టం జరిగితే క్షేత్ర స్థాయిలో అంచనాలు రూపొందిస్తాయని తెలియదా అని ప్రశ్నిస్తున్నారు. తుది జాబితా తయారయ్యాక ప్రభుత్వానికి నివేదించడం, నష్టపోయిన రైతులకు మార్గదర్శకాలకు అనుగుణంగా ఇన్‌పుట్ సబ్సిడీ విడుదల చేస్తారు. ఈ విషయం సుదీర్ఘ కాలం సీఎంగా చేసిన చంద్రబాబుకు తెలియదా అని రైతు సంఘాల ప్రతినిధులు ప్రశ్నిస్తున్నారు.

- తూర్పుగోదావరి జిల్లాలో 11 మండలాల పరిధిలోని 65 గ్రామాల్లో ప్రాథమికంగా పంట తడిసిందని గుర్తించారు. వరి, మొక్కజొన్న, ఇతర పంటలు అన్నీ కలిపి మొత్తంగా 1,200 హెక్టార్లలో పంట నీట మునిగింది. ఇందులో 1,100 హెక్టార్లలో వరికి నష్టం జరగగా, క్షేత్ర స్థాయిలో వాస్తవ పరిస్థితిపై బృందాలు అంచనాలు రూపొందిస్తున్నాయి.
- కాకినాడ జిల్లాలో పిఠాపురం, పెద్దాపురం, కాకినాడ రూరల్ తదితర నియోజకవర్గాల్లోని 10 మండలాల పరిధిలోని 127 గ్రామాల్లో వరి పంటకు నష్టం జరిగిందని ప్రాథమిక నివేదికలు చెబుతున్నాయి.
- ఈ మండలాల్లో అకాల వర్షాలతో కాలువలు, డ్రైన్‌ల పక్కన ఉన్న 1,193 హెక్టార్లలో వరి తడిసిందని గుర్తించారు.
- ఈ పంటలో నష్టం ఏమేరకు ఉంటుందనేది ఈ బృందాలు అంచనా వేస్తున్నాయి.
- డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో తొమ్మిది మండలాల్లో వరి నీట మునిగిందని.. ధాన్యం తడిసిముద్దయ్యిందని ప్రాథమికంగా తేల్చారు.
- ఈ జిల్లాలోని 104 గ్రామాల్లోని 412 హెక్టార్లలో పంటకు నష్టం జరిగినట్టు గుర్తించారు. ఇలాంటి పంట పొలాలను సర్వే బృందాలు మరోసారి నిశితంగా పరిశీలించనున్నాయి.
- సాంకేతిక అవగాహనతో ఒక అంచనాతో జాబితాను రూపొందిస్తాయి.

ఇంత త్వరగా వస్తారనుకోలేదు



15 ఎకరాలు సాగు చేస్తున్నాను. వర్షాలతో కొంత పంట తడిసిపోయింది. తడిసినప్పటికీ అధికారులు వచ్చి పరిశీలిస్తారా లేదా అనే అనుమానపడ్డాం. అటువంటిది అకాల వర్షాలతో పంటలు తడిసిన ఇంత తక్కువ వ్యవధిలోనే అంచనాలు తయారు చేసేందుకు ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వడం సంతోషం. ఇలా ఏ ప్రభుత్వం ఇంత త్వరగా పంట నష్టాలు తయారుచేయలేదు.

– కొమ్మిరెడ్డి శ్రీనివాసరావు,వరి రైతు, గాడిలంక

పరిహారం ఇస్తుందనే నమ్మకం



ప్రకృతి సహకరించడంతో పంట దిగుబడి బాగా వచ్చింది. గత నెల 28న వరి కోతలు పూర్తి చేశాను. ధాన్యం కళ్లాల్లోకి చేర్చి రైతు భరోసా కేంద్రాలకు తరలించి అమ్ముదామనుకునే సమయంలో అకాల వర్షాలకు పంట తడిసిపోయింది. ఈ సమయంలో రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం నష్టం అంచనాలు తయారు చేయడానికి ముందుకు రావడంతో ధైర్యం కలిగింది.

– బిక్కిన సీతారామ్,చోడవరం, రామచంద్రపురం

అంచనాలు రూపొందిస్తున్నాం



అకాల వర్షాలతో జరిగిన నష్టాన్ని అంచనా వేస్తున్నాం. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండల, గ్రామ స్థాయిలో ఏర్పాటు చేసిన బృందాలు క్షేత్ర స్థాయిలో అంచనాలు రూపొందిస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా వర్షాలతో తడిసినట్టు ప్రాథమికంగా గుర్తించిన పంట పొలాలను పరిశీలిస్తున్నాయి. నష్టం అంచనాలు తయారుచేసే ప్రక్రియ ప్రారంభించాం. రెవెన్యూ, వ్యవసాయ శాఖలు సమన్వయంతో క్షేత్ర స్థాయిలో ప్రతి పంట క్షేత్రం వద్దకు నేరుగా వెళుతున్నాయి.

– ఎన్.విజయకుమార్,వ్యవసాయశాఖ అధికారి, కాకినాడ జిల్లా

పేదలకు నాణ్యమైన వైద్య సేవలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ వంగా గీత. చిత్రంలో కలెక్టర్ కృతికాశుక్లా, ఎమ్మెల్యే ద్వారంపూడి, ఎస్పీ సతీష్‌కుమార్ తదితరులు

కాకినాడ: పేదలకు నాణ్యమైన, అత్యాధునిక వైద్యాన్ని అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీ వంగా గీత పేర్కొన్నారు. కాకినాడ దుమ్ములపేటలో రూ.1.39 కోట్లతో నిర్మించనున్న వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి, కలెక్టర్ కృతికాశుక్లా, ఇన్‌చార్జి జేసీ మహేష్ కుమార్, ఎస్పీ సతీష్ కుమార్‌లతో కలిసి ఆమె బుధవారం శంకుస్థాపన చేశారు. కాకినాడ సీపోర్ట్స్ సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కేవీ రావు సీఎస్ఆర్ నిధుల ద్వారా ఆసుపత్రి నిర్మాణానికి ముందుకు వచ్చారు. సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి విజ్ఞప్తి మేరకు ఈ నిధులు సమకూర్చారు. ట్రస్ట్ ఆసుపత్రి తరఫున ముగ్గురు వైద్యులను అక్కడి సేవల కోసం వినియోగించేందుకు ఆస్పత్రి యాజమాన్యం ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ఈఎస్‌ఐ ఆసుపత్రి మరో రెండు నెలల్లో అందుబాటులోకి రానుందన్నారు. ఎమ్మెల్యే చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ పేద మత్స్యకార వర్గాలకు ప్రయోజనం కలిగే ఆసుపత్రి నిర్మాణం కోసం కోరిన వెంటనే కేఎస్‌పీఎల్ యాజమాన్యం అంగీకారం తెలిపిందన్నారు. గతంలో కూడా సామాజిక సేవా కార్యక్రమాలకు తోడ్పాటును అందించిందన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ సీఎస్ఆర్ నిధులతో ప్రథమంగా ఆసుపత్రి నిర్మాణం జరుగుతోందన్నారు. కేఎస్‌పీఎల్ సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కేవీ రావు మాట్లాడుతూ అత్యాధునిక వసతులతో ఆసుపత్రి నిర్మాణాన్ని అతి త్వరలోనే వినియోగంలోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కొడా చైర్ పర్సన్ రాగిరెడ్డి చంద్రకళా దీప్తి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు, మాజీ మేయర్ సుంకర శివప్రసన్న, ఎమ్మెల్సీ అభ్యర్థి కర్రి పద్మశ్రీ, మాజీ డిప్యూటీ మేయర్లు పసుపులేటి వెంకట లక్ష్మి, చోడిపల్లి సత్య ప్రసాద్ అధికారులు పాల్గొన్నారు.

వేగవంతంగా ప్రభుత్వ భవనాల నిర్మాణం



ఆర్‌బీకే ప్రారంభోత్సవంలో కలెక్టర్ కృతికా శుక్లా, ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, ఎంపీ వంగా గీత

- 25 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ
- జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా వెల్లడి

కాకినాడ రూరల్: గ్రామ సచివాలయాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు, రైతు భరోసా కేంద్రాలకు సంబంధించి బిల్లులు విడుదలవ్వడంతో ప్రభుత్వ శాశ్వత భవనాల నిర్మాణాలు వేగవంతమైనట్టు కలెక్టర్ కృతికాశుక్లా తెలిపారు. కాకినాడ రూరల్ మండలం సర్పవరంలో ఉపాధిహామీ నిధులు రూ.25.80 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని బుధవారం ఎమ్మెల్యే కురసాల కన్నబాబుతో కలిసి ఎంపీ వంగా గీత, కలెకర్ కృతికాశుక్లా ప్రారంభించారు. రైతు భరోసా కేంద్రం భవనాలను పరిశీలించారు. రైతులకు సేవలందించేందుకు ఆర్‌బీకేలో ఏర్పాటు చేసిన కియోస్క్ గురించి వ్యవసాయ శాఖ మాజీ మంత్రి కన్నబాబు ఎంపీ, కలెక్టర్లకు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రబీ సీజన్‌కు సంబంధించి 50 శాతం పంట కోతలు పూర్తయ్యాయన్నారు. రైతుల నుంచి ఆర్‌బీకేల ద్వారా ధాన్యం సేకరిస్తున్నామన్నారు. జిల్లాలో నేటికి 25 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు తడిసిన ధాన్యాన్ని రైతులు ఆరబెట్టుకుంటున్నారని, కనీస మద్దతు ధర కన్నా తక్కువకు అమ్మవద్దని రైతులకు సూచించారు. వర్షానికి దెబ్బతిన్న పంట గణన ప్రారంభమైందని, ఈనెల 24నాటికి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామన్నారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే కన్నబాబు మాట్లాడుతూ ఇటీవల వర్షాలకు కొంత మేర పంట నష్టం వాటిల్లిందన్నారు. ధాన్యం తడిసిపోవడంతో రైతులు ఇబ్బందులు పడ్డారని, సీఎం జగన్‌మోహన్ రెడ్డి ఎప్పటికప్పుడు అధికారులు, ప్రజా ప్రతినిధులతో సమీక్షించి అప్రమత్తం చేశారన్నారు. అనంతరం ఆర్‌బీకేల ద్వారా ధాన్యం కొనుగోలు చేసిన రైతులకు స్లిప్‌లను కలెక్టర్ అందించారు. డీఎల్‌డీఓ నారాయణమూర్తి, ఏడీఏ పద్మశ్రీ పాల్గొన్నారు.

జగనన్నకు చెబుదాం ద్వారా స్పందన బలోపేతం

మీడియాతో కలెక్టర్ కృతికా శుక్లా



జగనన్నకు చెబుదాంపై వివరిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ: జగనన్నకు చెబుదాం (జేకేసీ)తో ప్రజా సమస్యల పరిష్కారానికి మరింత వీలు కలుగుతుందని కలెక్టర్ కృతికా శుక్లా తెలిపారు. జిల్లా స్థాయి జర్నలిస్టుల అక్రెడిటేషన్ కమిటీ సభ్యులు బుధవారం కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా కలెక్టర్ జగనన్నకు చెబుదాం కార్యక్రమం గురించి మీడియాకు వివరించారు. 1902 హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫోన్ చేసి సమస్యను చెప్పొచ్చన్నారు. ప్రజల వద్దకు పాలనను తీసుకెళ్లడం, సేవలు పొందేలా చూడటం, పాలనలో ప్రజలను భాగస్వాములను చేయడం, జవాబుదారీతనంతో విధానాలను అమలు చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని రూపొందించిదన్నారు. స్పందనను జగనన్నకు చెబుదాం కార్యక్రమం బలోపేతం చేస్తుందన్నారు.

ఇంటి నుంచే ఫోన్‌ద్వారా..

జగనన్నకు చెబుదాం కార్యక్రమం ద్వారా ఇంటి నుంచే 1902కు కాల్ చేయవచ్చునని కలెక్టర్ కృతికాశుక్లా తెలిపారు. సమస్యను చెప్పగానే ఫిర్యాదును నమోదు చేసుకొని వైఎస్సార్ (యువర్ సర్వీస్ రిక్వెస్ట్) ఐడీని కేటాయిస్తారన్నారు. ఎప్పటికప్పుడు ఎస్ఎంఎస్ ద్వారా అర్జీ స్టేటస్ సమాచారం అందుతుందన్నారు. జగనన్నకు చెబుదాం ద్వారా అందిన అర్జీల పరిష్కారాన్ని స్వయంగా సీఎం కార్యాలయం (సీఎంవో) పర్యవేక్షిస్తుందన్నారు. మండల, డివిజన్, జిల్లా స్థాయిలో ప్రత్యేకంగా ప్రాజెక్టు మానిటరింగ్ యూనిట్లు ఇందుకు ఏర్పాటు చేశామన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా స్థాయిలో ఆడిటింగ్ కోసం రెవెన్యూ, పంచాయతీరాజ్, మెడికల్, పోలీస్, పట్టణాభివృద్ధి, గ్రామీణాభివృద్ధి వంటి 8 శాఖల అధికారులను నోడల్ అధికారులుగా నియమించినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ మొత్తం విధానాన్ని పర్యవేక్షించేందుకు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, డిప్యూటీ తహసీల్దార్, డిస్ట్రిక్ట్ మేనేజర్‌తో కలెక్టరేట్‌లో కమాండ్ కంట్రోల్ పాయింట్ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. సమస్య పరిష్కారం తర్వాత ప్రభుత్వ సేవలపై ప్రజలు తమ అభిప్రాయాన్ని తెలియజేసేందుకు వీలుంటుందన్నారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.



నిక్కచ్చిగా వేట నిషేధం.!

జిల్లాలో తీరప్రాంత మండలాలు	– 5
మత్స్యకార గ్రామాలు	– 36
మెరైన్ ఫిషర్‌మెన్ పాపులేషన్	– 2 లక్షల మంది
చేపల వేట ద్వారా జీవనోపాధి పొందే వారు	– 36 వేల మంది

మత్స్యకార భరోసా లబ్ధిదారుల వివరాలు

2020లో	– 27,118
2021లో	– 30,213
2022లో	– 21,345
2023లో	– 24,147

ఈ ఏడాది జమ కానున్న సొమ్ము

241.470,000

- సక్రమంగా అమలవుతున్న చేపల వేట నిషేధం
- మత్స్యకారుల నుంచి పూర్తి స్థాయిలో సహకారం
- సకాలంలో పరిహారం అందడమే ఇందుకు కారణం

పిఠాపురం: సముద్రంలో చేపల వేట నిషేధం నిక్కచ్చిగా అమలవుతోంది. పరిహారం విషయంలో ప్రభుత్వ నిర్ణయాల ఫలితంగా మత్స్యకారులే స్వచ్ఛందంగా నిషేధానికి సహకరిస్తున్నారు. దీంతో అధికారులకు దాడులు నిర్వహించే పనిలేకుండా పోయింది. మత్స్య సంపద పెరగడం కోసం వేట నిషేధ నిర్ణయం సరైనదే అయినా రెండు నెలల పాటు మత్స్యకారులు దుర్భర పరిస్థితులు ఎదుర్కొనేవారు. గత ప్రభుత్వాల హయాంలో పరిహారం సకాలంలో సరిగ్గా అందేది కాదు. ఏటా ఏప్రిల్ 15 నుంచి జూన్ 14 వరకు ప్రభుత్వం చేపల వేటను నిషేధిస్తుంది. పరిహారంగా ఒక్కో మత్స్యకార కుటుంబానికి రూ. 4000 పరిహారంగా చెల్లించాల్సి ఉన్నా టీడీపీ ప్రభుత్వం సరిగ్గా పట్టించుకునేది కాదు. నిషేధం పూర్తయ్యాక ఎప్పుడో ఇచ్చేవారు. దీంతో మత్స్యకారులు మరో దారి లేక దొంగచాటుగా వేట సాగించేవారు.

ప్రస్తుతం ఇలా..

కాకినాడలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు మత్స్యకారులకు వేట నిషేధ పరిహారం రూ.10 వేలకు పెంచారు. మూడేళ్ల నుంచి ఎటువంటి అవినీతికి తావు లేకుండా పార్టీలకు అతీతంగా పారదర్శకంగా పరిహారం విడుదల చేస్తున్నారు. ఈ ఏడాది కూడా పరిహారం మత్స్యకారుల ఖాతాలకు జమ చేయడానికి రంగం సిద్ధమైంది. వేట నిషేధ సమయంలో ఆర్థికంగా ఇబ్బంది లేకుండా పోయిందని మత్స్యకారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఆర్థిక సహాయం అందడంతో మత్స్యకారులు వేటను పూర్తిగా నిలిపివేసి స్వచ్ఛందంగా నిషేధాన్ని అమలు చేస్తున్నారు.



లంగరేసిన బోట్లుతో ఖాళీగా ఉన్న తీర ప్రాంతం

పరిహారం అంటే ఇదీ



గతంలో వేట నిలిపేస్తే జీవనోపాధి ఆగిపోయేది. తిండి లేక అలమటించే వాళ్లం. రూ.4 వేలు పరిహారం ఇస్తామని, నెలలు గడిచినా ఇచ్చేవారు కాదు. ఇప్పుడు అలా కాదు. వేట నిషేధం మొదలైన వెంటనే పరిహారం ఇచ్చేస్తున్నారు. ఎవరి సిఫార్సులు లేవు. పార్టీల ఊసే లేదు. అందరికీ సక్రమంగా అందుతోంది. ఇలా సకాలంలో పరిహారం ఇస్తే ఎందుకు తప్పు చేస్తాం.

– తిత్తి పవన్, మత్స్యకారుడు, కోనపాపపేట

అవసరానికి ఆదుకుంటున్నారు



ఇస్తానన్న పరిహారం సరైన సమయానికి ఇస్తున్నారు. వేట లేని కాలంలో అవసరానికి ఆదుకుంటున్నారు. అందుకే ఎవరూ వేటకు వెళ్లడం లేదు. గతంలో తక్కువ వచ్చేది. ఇప్పుడు సరిపడినంతా ఇస్తున్నారు. దీంతో ఇబ్బందులు లేకుండా రెండు నెలలు గడుస్తున్నాయి. గతంలో పరిహారం సరిగా అందక దొంగచాటుగా వేటకు వెళ్లే వాళ్లం. ఇప్పుడు ఎవరు అలా చేయడం లేదు.

– మైలపల్లి దాసు, మత్స్యకారుడు, కోనపాపపేట

నిషేధం పక్కాగా అమలవుతోంది



మత్స్యకారులు స్వచ్ఛందంగా చేపల వేట నిషేధం పాటిస్తున్నారు. మూడేళ్ల నుంచి ఇలాగే సహకరిస్తున్నారు. గతంలో మత్స్యశాఖతో పాటు పోలీసు, మెరైన్ అధికారులు దాడులు చేయాల్సి వచ్చేది. నిషేధాన్ని ఉల్లంఘించి వేట సాగించే వారిపై కేసులు నమోదు చేయాల్సి వచ్చేది. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. పరిహారం సక్రమంగా సకాలంలో అందడం వల్లే వారీ విధంగా వ్యవహస్తున్నారు.

– సత్యనారాయణ, జేడీ మత్స్యశాఖ, కాకినాడ

క్లుప్తంగా

నూక శాతాన్ని పరిశీలించిన ఉన్నతాధికారి



ప్రకాశరావుపాలెం ఆర్‌బీకేలో నూక శాతం పరిశీలిస్తున్న కమిషనర్ అరుణకుమార్

నల్లజర్ల: రైతుల నుంచి సేకరించిన ధాన్యంలో నూక శాతం ఎక్కువగా వస్తోందంటున్న మిల్లర్ల ఆరోపణలను స్వయంగా పరిశీలించేందుకు పౌరసరఫరాల శాఖ స్పెషల్ కమిషనర్ అరుణకుమార్ మండలంలోని ప్రకాశరావుపాలెం రైతు భరోసా కేంద్రాన్ని బుధవారం సందర్శించారు. వచ్చిన ధాన్యం శాంపిల్స్‌లో ఒక దానిని మెషీన్‌లో వేసి స్వయంగా పరిశీలించారు. 40 శాతం నూక వచ్చినట్టు గుర్తించారు. ఇలా ఎందుకు వస్తోందని వ్యవసాయ శాఖ అధికారులను ప్రశ్నించారు. ధాన్యం వర్షంలో తడవడం ఒక కారణమైతే, ఎండ వేడిమి కూడా మరో కారణమని వారు వివరించారు. వర్షాలు కురవక ముందే మార్చి నెలాఖరు నాటికి రబీ పంట పూర్తయ్యేలా రైతులను చైతన్య పరచాలని ఆయన సూచించారు. తక్కువ కాలపరిమితి గల వరి వంగడాలను రైతులకు సిఫారసు చేయాలన్నారు. అక్కడున్న రైతులతో అరుణ్‌కుమార్ మాట్లాడారు. ధాన్యం అమ్మకంలో ఇబ్బందులు ఉన్నాయా అని ఆయన రైతులను ప్రశ్నించారు. 15 రోజుల ముందుగానే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తే కొంతవరకు తమకు ఇబ్బంది కలిగేది కాదని వారు బదులిచ్చారు. దగ్గరలో ఉన్న రైస్ మిల్లులను తమకు కేటాయించాలని కోరారు. డబ్బులు ఎన్ని రోజుల్లో ఖాతాలకు జమ అవుతున్నాయని ప్రశ్నించగా మూడు, నాలుగు రోజులలోనే జమ అవుతున్నట్టు రైతులు బదులిచ్చారు. నూక శాతం ఎక్కువగా వస్తోందంటూ తమను మిల్లర్లు ఇబ్బంది పెడుతున్నారని రైతులు ఆయనకు తెలిపారు. రైతులకు ఇబ్బంది లేకుండా మిల్లర్లతో మాట్లాడాలని అధికారులను ఆదేశించారు. ధాన్యం అమ్మకం విషయంలో దళారులకు అవకాశం ఇవ్వవద్దన్నారు. ధాన్యం మిల్లుకు పంపేందుకు రవాణా, హమాలీల చార్జీలు ప్రభుత్వమే భరిస్తుందన్న విషయం మీకు తెలుసా? అని రైతులను అరుణ్‌కుమార్ అడిగారు. తెలుసునని రైతులు బదులిచ్చారు. ఆయన వెంట డీఎస్‌ఓ ప్రసాదరావు, డీఎం నాగార్జున, ఏఎస్‌ఓ భాస్కర్ , ఏడీఏ చంద్రశేఖర్, కొవ్వూరు ఆర్డీవో మల్లిబాబు, తహసీల్దార్ కిశోర్‌కుమార్, ఏవో కమల్‌రాజ్ ఉన్నారు.

సప్లిమెంటరీ కసరత్తులు

- పది, ఇంటర్ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు
- ఆదేశాలు జారీచేసిన పాఠశాల, మాధ్యమిక విద్యాశాఖలు
- ఇంటర్‌లో 23,583, పదిలో 20,438 మంది ఫెయిలైన విద్యార్థులు



రాయవరంలో నిర్వహిస్తున్న ఇంటర్ ప్రత్యేక తరగతులు

రాయవరం: పదో తరగతి, ఇంటర్మీడియెట్ ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించలేని విద్యార్థులపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ పాస్ కాని వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించేందుకు అటు పాఠశాల విద్యాశాఖ, ఇటు మాధ్యమిక విద్యాశాఖ అధికారులు చర్యలు చేపట్టారు. ఫెయిలైన విద్యార్థులను గట్టెక్కించేందుకు పునశ్చరణ తరగతులకు శ్రీకారం చుట్టారు.

23,583 మంది విద్యార్థులు ఫెయిల్

గత నెల 26న ఇంటర్మీడియెట్ ఫలితాలు విడుదలయ్యాయి. ఇంటర్మీడియెట్ ఫస్టియర్ పరీక్షలకు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 42,137 మంది హాజరవ్వగా, 17,251 మంది ఫెయిలయ్యారు. ఫస్టియర్‌లో 59శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. సెకండియర్‌కు 36,833 మంది విద్యార్థులు హాజరయ్యారు. 6,332 మంది ఫెయిల్ కాగా, 69 శాతం ఉత్తీర్ణత సాధించారు. వీరిలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ ఉత్తీర్ణత సాధించలేని విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఫెయిలైన విద్యార్థులకు మూడు వారాల శిక్షణ ఇస్తున్నారు. ఈ నెల 24 నుంచి జూన్ ఒకటో తేదీ వరకు ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించడానికి షెడ్యూల్ విడుదల చేశారు. పరీక్ష ముందు రోజు వరకు శిక్షణ ఇవ్వనున్నారు. జిల్లాలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, కేజీబీవీలు, రెసిడెన్షియల్ కాలేజీలు, హైస్కూల్ ప్లస్ స్కూల్స్, మోడల్ స్కూల్స్ ఉన్నాయి. వీరందరికీ ఇప్పటికే ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ఫస్టియర్‌కు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సెకండియర్‌కు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు నిర్వహించనున్నారు.

'పది' విద్యార్థులకు సైతం

పదో తరగతి పరీక్షల ఫలితాలు ఈ నెల 6న విడుదలయ్యాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 68,759 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 5,021, తూర్పుగోదావరి జిల్లాలో 6,667, కాకినాడ జిల్లాలో 8,750 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించలేకపోయారు. వివిధ సబ్జెక్టుల్లో వీరు ఫెయిలయ్యారు. పరీక్షల ఫలితాల రోజునే ప్రభుత్వ పరీక్షల విభాగం సప్లిమెంటరీ పరీక్షలకు షెడ్యూల్‌ను కూడా విడుదల చేసింది. వచ్చే నెల 2 నుంచి 10వ తేదీ వరకు సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నారు. ఆయా సబ్జెక్టుల్లో ఫెయిలైన విద్యార్థులు పరీక్షలు తిరిగి రాసేందుకు పరీక్ష ఫీజుల షెడ్యూల్‌ను కూడా విడుదల చేశారు. పరీక్షలు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు నిర్వహించనున్నారు.

పరీక్షలు పూర్తయ్యే వరకు

పది సప్లిమెంటరీ పరీక్షలు పూర్తయ్యే వరకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. ఫెయిలైన విద్యార్థులకు స్పెషల్ సమ్మర్ కోర్సులు తప్పనిసరిగా నిర్వహించాల్సి ఉంది. ఇందుకుగాను ఆయా పాఠశాలల హెచ్ఎంలు ప్రతి రోజు సబ్జెక్టుల వారీగా, పీరియడ్ల వారీగా యాక్షన్ ప్లాన్ తయారు చేయాల్సి ఉంది. ఆయా సబ్జెక్టుల వారీగా ఫెయిలైన విద్యార్థుల జాబితా తయారు చేసి, విద్యార్థులను మోటివేట్ చేసి, వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించాలి. గణితం, సైన్స్ వంటి ముఖ్యమైన సబ్జెక్టుల విషయంలో మరింత ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలి. ప్రతి రోజు టెస్టులు నిర్వహించాలి. పూర్వం జరిగిన పబ్లిక్ పరీక్షల పేపర్లలోని ప్రశ్నలను ప్రాక్టీస్ చేయించాలి. పది విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక సమ్మర్ క్యాంపులను డీవైఈవోలు, ఎంఈవోలు ప్రతిరోజు విజిట్ చేసి, పర్యవేక్షణ చేయాలి. విద్యార్థులను మోటివేట్ చేయాల్సి ఉంది.

పది పరీక్షల షెడ్యూల్

తేదీ	పరీక్ష
జూన్ 2	తెలుగు/కాంపోజిట్ కోర్సు
జూన్ 3	హిందీ
జూన్ 5	ఇంగ్లిషు
జూన్ 6	గణితం
జూన్ 7	సైన్స్
జూన్ 8	సోషల్
జూన్ 9	ఓఎస్ఎస్‌సీ పేపరు-1
జూన్ 10	ఓఎస్ఎస్‌సీ పేపరు-2

ఇంటర్ పరీక్షల షెడ్యూల్

మే 24	సెకండ్ లాంగ్వేజ్
మే 25	ఇంగ్లిష్
మే 26	గణితం1ఎ, బోటనీ, సివిక్స్
మే 27	గణితం1బి, జువాలజీ, హిస్టరీ
మే 29	ఫిజిక్స్, ఎకనామిక్స్
మే 30	కెమిస్ట్రీ, కామర్స్, సోషియాలజీ, ఫైన్స్ ఆర్ట్స్, మ్యూజిక్
మే 31	పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, లాజిక్, బ్రిడ్జికోర్సు గణితం
జూన్ 1	మోడ్రన్ లాంగ్వేజ్, జాగ్రఫీ

తరగతులు నిర్వహిస్తున్నాం



ఇంటర్మీడియెట్ బోర్డు ఆదేశాల ప్రకారం పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. ఫెయిలైన విద్యార్థులు తిరిగి ఉత్తీర్ణత సాధించే విధంగా ఆయా సబ్జెక్టుల్లో తర్ఫీదునిస్తున్నాం.

– ఎస్‌వీవీ సత్యనారాయణరెడ్డి, డీవీఈవో, ఇంటర్మీడియెట్ బోర్డు, అమలాపురం.

ప్రణాళిక ప్రకారం తర్ఫీదు



పది పరీక్షల్లో తప్పిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలి. ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలతో కూడిన ఆదేశాలను జారీ చేశాం. ప్రతి విద్యార్థి పరీక్షల్లో తిరిగి ఉత్తీర్ణత సాధించే విధంగా ఆయా సబ్జెక్టుల ఉపాధ్యాయులు ప్రణాళిక ప్రకారం తర్ఫీదునివ్వాలి.

– జి.నాగమణి, ఆర్‌జేడీ, పాఠశాల విద్యాశాఖ, కాకినాడ

తల్లిదండ్రులు శ్రద్ధ తీసుకోవాలి



పదవ తరగతి ఫెయిలైన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఆదేశాలిచ్చాం. వాటికి అనుగుణంగా ఉపాధ్యాయులు తరగతులు నిర్వహిస్తున్నారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను పాఠశాలల్లో ప్రత్యేక తరగతులకు పంపించే విధంగా శ్రద్ధ తీసుకోవాలి.

– ఎం.కమలకుమారి, డీఈవో, అమలాపురం

పాలనా భాషగా తెలుగు అమలు కావాలి

అధికార భాషా సంఘం అధ్యక్షుడు విజయబాబు



సమావేశంలో మాట్లాడుతున్న అధికార భాషా సంఘం అధ్యక్షుడు విజయ బాబు

రాజమహేంద్రవరం సిటీ: ప్రజలకు సులభంగా అర్థమయ్యే రీతిలో తెలుగుభాష చేరువయ్యే విధంగా రాష్ట్ర పాలనలో వివిధ విభాగాల్లో తెలుగు భాష అమలు జరిగేలా అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం అధ్యక్షుడు పి.విజయబాబు పేర్కొన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం పరిపాలనా కార్యక్రమాల్లో తెలుగు భాష అమలు చేయడంపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు సరళమైన, వాడుక భాషలోనే ప్రత్యుత్తరాలు జరపడం సామాజిక బాధ్యతగా చేపట్టాల్సి ఉందన్నారు. మౌఖిక భాషను పాల నా భాషగా అమలు చేయడం కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు ప్రయత్నం చేయాలని కోరారు. తెలుగు భాషా వికాసానికి ఈ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అధికార భాషా సంఘం అధ్యక్షుడి నియామకం చేపట్టడం ఇందుకు నిదర్శనం అన్నారు. రాష్ట్రంలో తెలుగుభాషా ప్రభావాన్ని సంస్కృతిని ప్రతిబింబించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.

రాజమహేంద్రవరం అమ్మలాంటిది

తొలిసారిగా తిరుపతిలో అధికారులతో సమావేశం నిర్వహించి, రెండో సమావేశం తూర్పుగోదావరిలో నిర్వహిస్తూన్నట్లు విజయబాబు తెలిపారు. రాజమహేంద్రవరం తెలుగు భాషకు అమ్మలాంటిదన్నారు. వేదంలా ఘోషించే గోదావరి పాట వింటే ఒక్కసారి అయినా రాజమహేంద్రవరం చూడాలని ప్రతి ఒక్కరికీ అనిపిస్తుందన్నారు. అధికార భాష అమలులో భాగంగా 1988 ప్రభుత్వం తెలుగు అమలు కోసం రూపొందించిన పలు ఉత్తర్వులను పేర్కొన్నారు. రెవెన్యూ, పోలీస్, న్యాయస్థానాల ద్వారా వచ్చే తీర్పులు తెలుగులో ముద్రించి ఇచ్చే అవకాశం కోసం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి వెళ్లి విన్నవిస్తానన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి జి.నరసింహులు మాట్లాడుతూ స్పందన ఫిర్యాదుల విషయంలో నూరు శాతం తెలుగు అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. గత ఏడాది గిడుగు రామ్మూర్తి పుట్టిన రోజు నుంచి కలెక్టరేట్‌లో తెలుగులో ప్రతి రోజూ ఒక తెలుగు పదం, వాక్యం రాస్తున్నట్లు ఆర్డీవో ఎస్.మల్లిబాబు తెలిపారు. అదనపు ఎస్పీ సీహెచ్ పాపారావు మాట్లాడుతూ, పోలీసు స్టేషన్ కి వచ్చే ఫిర్యాదులు ఎఫ్ఐఆర్‌ను తెలుగులోనే నమోదు చేస్తున్నామని తెలిపారు.

సై .. సై .. జోడెడ్లాబండి



ఎడ్లబండిపై ప్రయాణిస్తున్న రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యే

రాజానగరం: సై .. సై .. జోడెడ్లా బండి .. అంటూ రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, హోం మంత్రి తానేటి వనిత, ఎంపీలు పిల్లి సుభాష్ చంద్రబోస్, మార్గాని భరత్‌రామ్, స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా, రుడా చైర్మన్ మేడపాటి షర్మిలారెడ్డి, తదితరులు ఎడ్ల బండిపై హుషారుగా ప్రయాణం చేశారు. లాలాచెరువు హౌసింగ్‌బోర్డు కాలనీలో నిర్మించిన రైతు బజారు ప్రారంభోత్సవానికి వచ్చిన వీరికి రాజానగరం వ్యవసాయ మార్కెట్ కమిటీ స్వాగతం పలుకుతూ ప్రత్యేకంగా ఎడ్లబండిని ఏర్పాటు చేసింది. దానిపై లాలాచెరువు జంక్షన్ నుంచి హెచ్‌బీ కాలనీలోని రైతుబజారు వరకు జాతీయ రహదారిపై ఈ విధంగా వారు ప్రయాణించారు. సాధారణంగా ఎడ్ల బండ్లపై కేరింతలు కొడుతూ, హుషారుగా సంక్రాంతి సంబరాలలో ప్రయాణిస్తుంటారు. ఈ విధంగా రైతుబజారు ప్రారంభోత్సవానికి వచ్చిన నాయకులు పండగ శోభను తీసుకువచ్చారు.

ఆగివున్న ట్రాలీని ఢీ కొట్టిన బస్సు

ఇద్దరు డ్రైవర్లలో ఒకరు మృతి, మరొకరికి తీవ్ర గాయాలు

రాజానగరం: జాతీయ రహదారిపై నన్నయ యూనివర్సిటీ సమీపంలో ఆగివున్న ట్రాలీని పెండ్లి బృందంతో వెళ్తున్న ట్రావెల్స్ బస్సు ఢీ కొనడంతో అందులో ఉన్న ఇద్దరు డ్రైవర్లలో ఒకరు మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై జుబేర్ తెలిపిన వివరాలిలావున్నాయి. విశాఖపట్నం నుంచి రాజమహేంద్రవరం వైపు ఐరన్ దిమ్మల లోడుతో వెళ్తున్న ట్రాలీ పాడవడంతో పై ప్రాంతంలో ఆగిపోయింది. అదే రూటులో బుధవారం తెల్లవారుజామున శ్రీకాకుళం నుంచి రాజమహేంద్రవరం వైపు పెండ్లి బృందాన్ని తీసుకువెళ్తున్న ట్రావెల్స్ బస్సు అతివేగంగా వచ్చి ఆగివున్న ట్రాలీని ఢీ కొనడంతో ఈ ప్రమాదం జరిగింది. దీనితో బస్సు ముందు భాగం నుజ్జునుజ్జుఅయి, క్యాబిన్‌లో కూర్చుని ఉన్న అదనపు డ్రైవర్ ఆలీ (47) అక్కడికక్కడే మృతి చెందాడు. బస్సు నడుపుతున్న డ్రైవర్ రెండు కాళ్లు క్యాబిన్‌లో ఇరుక్కుపోయాయి. అతికష్టం మీద బయటకు తీసి చికిత్స కోసం విజయవాడకు తరలించారు. పెండ్లి బృందంలో ఒకరిద్దరికి స్వల్పగాయాలు అయ్యాయి.

పెళ్లింట విషాదం

కుమార్తె వివాహం కోసం కర్ర నరుకుతుండగా విద్యుత్ షాక్‌కు గురై వ్యక్తి మృతి



వెంకటేష్ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

గోకవరం: మరికొద్ది రోజుల్లో ఆ ఇంట్లో వివాహం జరగబోతోంది. కుమార్తె వివాహ పనుల్లో భాగంగా పందిరి రాట వేసేందుకు కర్ర నరుకుతుండగా హైటెన్షన్ విద్యుత్ వైరుపై పడి విద్యుదాఘాతానికి గురై ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ దుర్ఘటనతో పెళ్లింట తీవ్ర విషాదం నెలకొంది. గోకవరం మండలం వెదురుపాకకు చెందిన చెనుబోయిన వెంకటేష్ (42) కూలీ పనులు చేసుకుని జీవిస్తున్నాడు. అతనికి భార్య లోవమ్మ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్దకుమార్తె వీరదుర్గకు ఈ నెల 20వ తేదీన వివాహం నిశ్చయించారు. 17న ఇంటి ఆవరణలో పందిరి రాట వేసేందుకు భార్యాభర్తలు ఇద్దరూ కలిసి బుధవారం బావాజీపేట శివారున ఉన్న పోలవరం కాలువ గట్టు వద్దకు వెళ్లారు. కర్రలు నరుకుతుండగా ఒక కర్ర 220 కేవీ హైటెన్షన్ వైరుపై పడి విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. కళ్లెదుటే భర్త మృతి చెందడంతో ఆమె షాక్‌కు గురైంది. కుమార్తెలు సంఘటన స్థలానికి చేరుకుని తండ్రి మృతదేహం వద్ద బోరున విలపించారు. మృతదేహాన్ని పోలీసులు రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. భార్య ఫిర్యాదు మేరకు హెచ్‌సీ శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనతో గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది.

రూ.కోటితో సప్తగోదావరి అభివృద్ధి

రామచంద్రపురం రూరల్: దక్షిణ కాశీగా, పంచారామ క్షేత్రాల్లో ఒకటిగా, త్రిలింగ క్షేత్రాల్లో ఒకటిగా, అష్టాదశ శక్తి పీఠాల్లో 12వ శక్తి పీఠంగా విరాజిల్లుతున్న శ్రీ మాణిక్యాంబా సమేత భీమేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలోని సప్త గోదావరి అభివృద్ధికి ప్రభుత్వం దేవదాయ శాఖ నుంచి సీజీఎఫ్ (కామన్ గుడ్ ఫండ్) నిధులు రూ.1 కోటి మంజూరు చేసినట్లు రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ బుధవారం విలేకరులకు తెలిపారు. ఆయన మాట్లాడుతూ అత్యంత ప్రసిద్ధి చెందిన పురాతన దేవాలయం ద్రాక్షారామ భీమేశ్వరాలయం అన్నారు. ఆలయ ప్రాంగణంలోని సప్త గోదావరి జలాలతో స్వామికి తొలి అభిషేకం చేస్తారని, భక్తులు సప్త గోదావరిలో స్నానమాచరించి స్వామి దర్శనానికి వెళ్లడానికి ఎంతో ప్రాధాన్యం ఇస్తారని చెప్పారు. భక్తుల మనోభావాలకు అనుగుణంగా సప్త గోదావరిని శుద్ధ జలాలతో ఉండే విధంగా అభివృద్ధి చేయడానికి సంకల్పించినట్లు తెలిపారు.

మహనీయులను స్ఫూర్తిగా తీసుకోవాలి



రాజగోపురానికి శంకుస్థాపన చేస్తున్న చిన జీయర్ స్వామి

- త్రిదండి శ్రీమన్నారాయణరామానుజ చినజీయర్‌స్వామి
- జి.మామిడాడలో వేంకటేశ్వరస్వామి రాజగోపురానికి శంకుస్థాపన

పెదపూడి: శ్రీ వేంకటేశ్వరస్వామి వారి గురువు రామానుజం అని, అలాంటి మహనీయులను స్ఫూర్తిగా తీసుకుని అందరూ ముందుకు సాగాలని త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్ స్వామి భక్తులకు ఉపదేశించారు. జి.మామిడాడ గ్రామం సూర్యనారాయణపురంలో శ్రీ అలివేలు మంగ, పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి వారి రాజగోపురం (గాలి గోపురం) కోసం చిన జీయర్‌స్వామి బుధవారం శంకుస్థాపన చేశారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్తలు నల్లమిల్లి పద్మనాభ సత్యనారాయణరెడ్డి, నల్లమిల్లి మోహన్‌రామ గంగాధర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ఆదిలక్ష్మి దంపతులు ముఖ్య అతిథులుగా హాజరై శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. చిన జీయర్‌స్వామి, ఎమ్మెల్యే దంపతులు వేంకటేశ్వరస్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం చినజీయర్ స్వామి మాట్లాడుతూ హైందవ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించడానికి అందరూ కృషి చేయాలన్నారు. వేంకటేశ్వర స్వామి వారి జీవిత చరిత్ర, ప్రత్యేకత, తిరుమల తిరుపతి దేవస్థానం గురించి భక్తులకు వివరించారు. ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ భక్తి శ్రద్ధలతో ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఎంపీపీ కేతా తులసి, వైస్ ఎంపీపీ ద్వారంపూడి పద్మరెడ్డి, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు కర్రి శ్రీవెంటరెడ్డి, గ్రామ ఉప సర్పంచ్ కర్రి తాతారెడ్డి పాల్గొన్నారు.

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సత్యదేవుని నమూనా ఆలయానికి గ్రీన్ సిగ్నల్

నవంబర్ నాటికి నిర్మాణాలన్నీ పూర్తి చేయాలని ఈఓ ఆదేశం



సత్యదేవుని నమూనా ఆలయం నిర్మించే స్థలం

అన్నవరం: జాతీయ రహదారిపై సత్యదేవుని నమూనా ఆలయం నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ వచ్చింది. మరో ఆరు నెలల్లో నమూనా ఆలయంలో భక్తులు స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను దర్శించే అవకాశం దక్కనుంది. ఇందుకు గాను స్వామివారి నమూనా ఆలయం, ప్రసాదం కౌంటర్, భక్తులకు ఇతర సదుపాయాలు కల్పించేందుకు ఉద్దేశించిన నిర్మాణాలకు దేవదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ అనుమతి మంజూరు చేశారు. ఈ నిర్మాణాలన్నీ రూ.4.70 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించేందుకు దేవస్థానం అధికారులు ప్రతిపాదనలు పంపిన విషయం విదితమే. ఆ ప్రతిపాదనలకు పరిపాలన, సాంకేతిక అనుమతులు మంజూరు చేస్తూ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారని దేవస్థానం అధికారులు బుధవారం తెలిపారు.

మంత్రి సత్యనారాయణ ఆదేశాలతో...

సత్యదేవుని నమూనా ఆలయం, ప్రసాదం కౌంటర్ రాజమహేంద్రవరం వైపు వెళ్లే జాతీయ రహదారిపై కూడా నిర్మించాలని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, దేవదాయ, ధర్మాదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ గతేడాది మేలో అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం విశాఖపట్నం వైపు వెళ్లే జాతీయరహదారిపై మాత్రమే ఈ నమూనా ఆలయం, ప్రసాదం కౌంటర్ ఉన్నాయి. దీంతో ప్రసాదం కోసం భక్తులు రోడ్డు దాటుతున్నపుడు ప్రమాదాలు జరుగుతున్న విషయాన్ని మంత్రి గుర్తించి ఆ మేరకు ఆదేశాలిచ్చారు. దీంతో గతేడాది జూలైలో నమూనా ఆలయం నిర్మాణానికి మంత్రి కొట్టు, ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ శంకుస్థాపన చేశారు.

70 సెంట్ల స్థలంలో..

జాతీయరహదారిపై సత్యదేవ డిగ్రీ కళాశాల పక్కనే గల 70 సెంట్ల స్థలం చుట్టూ రక్షణ గోడ నిర్మించి హైవేకు సమానంగా ఆ స్థలాన్ని మట్టితో ఎత్తు చేస్తారు. అనంతరం సత్యదేవుని నమూనా ఆలయం, ప్రసాదం కౌంటర్, టాయిలెట్స్ బ్లాక్, ఫుడ్ ప్లాజా నిర్మాణాలు చేపడతామని అధికారులు తెలిపారు. సత్యదేవుని నమూనా ఆలయం నిర్మాణానికి ఆరు నెలలు, మిగిలిన వాటి నిర్మాణాలకు మూడు నెలలు చొప్పున సమయాన్ని నిర్ణయించారు. ఎట్టి పరిస్థితుల్లోను నవంబర్ నెలాఖరుకు ఈ నిర్మాణాలన్నీ పూర్తి కావాలని దేవస్థానం ఈఓ చంద్రశేఖర్ అజాద్ ఆదేశించారు.

నమూనా ఆలయం నిర్మాణంపై 'సాక్షి'లో కథనం

మంత్రి కొట్టు సత్యనారాయణ ఆదేశాల మేరకు స్వామివారి నమూనా ఆలయం నిర్మాణానికి చురుగ్గా ఏర్పాట్లు జరుగుతున్నాయని ఈ ఏడాది మార్చి 24న 'సాక్షి' 'అదిగో...అల్లదిగో...' శీర్షికన కథనం ప్రచురితమైంది. నవంబర్ కల్లా ఈ నిర్మాణాలు పూర్తి చేసేలా అధికారులు సన్నాహాలు చేస్తున్నట్లు ఈ కథనంలో చెప్పారు. ఈ మేరకు ప్రతిపాదనలు పంపడం, సాంకేతిక, పరిపాలన అనుమతులు ఇస్తూ కమిషనర్ ఆదేశాలివ్వడం, టెండర్లు పిలవడం అంతా 45 రోజుల్లో పూర్తయింది.